క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండల కేంద్రంలోని వేదవాహిని ప్రైవేట్ పాఠశాలను బుధవారం స్థానిక ఎంఈవో రాములు పరిశీలించారు. పాఠశాలలో వసతులు, తరగతి గదులను తనిఖీ చేశారు. తరగతి గదుల్లో సిమెంట్ బస్తాలు నిల్వ ఉంచకుండా చూడాలని ఆయన ఆదేశించినట్లు చెప్పారు. తరగతి గదులు అసంపూర్తిగా ఉండటంతో జిల్లా విద్యాశాఖ అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



దోమకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. దోమకొండ కోట ట్రస్ట్‌తో పాటు గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించడానికి మండల స్థాయిలో అండర్–18, అండర్–25 కేటగిరి వారీగా క్రీడలను నిర్వహించారు. గురువారం కూడా పోటీలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, గడికోట ట్రస్ట్ మేనేజర్ బాబ్జీ, కళాశాల ప్రిన్సిపల్ శంకర్, ఏఎస్సై సుబ్రమణ్యాచారి తదితరులున్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



పిట్లం(జుక్కల్) : పిట్లం జీపీ పరిధిలో బుధవారం లీకేజీ అవుతున్న మంచినీటి పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు నిర్వహించారు. బుధవారం నీటి సరఫరా సిబ్బందిచే పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేయించినట్లు జీపీ కార్యదర్శి యాదగిరి తెలిపారు. శాంతినగర్ కాలనీలో మురికి కాలువలను శుభ్రం చేయించి మురికి కాలువల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించారు.

సంపునకు మరమ్మతులు



బాన్సువాడ రూరల్ : 'సంపుతో విద్యార్థులకు ఇబ్బంది' అనే శీర్షికతో ఈనెల 26న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని కొత్తబాది గ్రామంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలోని సంపును శుభ్రం చేయించి కూలిపోయిన సైడ్‌వాల్స్ నిర్మించి విద్యార్థులకు ఉపయోగకరంగా మార్చారు.

వరి పంట తెగుళ్లపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్ గ్రామంలో బుధవారం వరి పంటలపై సోకే తెగుళ్లపై రైతులకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మాల్తుమ్మెద ఏరువాక కేంద్రం శస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌రెడ్డి, డాక్టర్ రేవంత్ అవగాహన కల్పించారు. వరి పంటలో చీడ పీడల నివారణ, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో కోరమాండల్ ప్రతినిధులు పాపిరెడ్డి, రమేశ్, సతీష్, మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా, పుస్తకాల అందజేత



దోమకొండ : మండలం ముత్యంపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు గ్రామానికి చెందిన ముత్తగారి సాయిప్రసన్న సందీప్ బీరువా, పుస్తకాలను బుధవారం అందజేశారు. సందీప్ గౌడ్ పెళ్లిరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు ముత్తగారి స్వరూప సునీల్ గౌడ్ జ్ఞాపకార్థం లైబ్రరీ బుక్స్, బీరువా అందజేశామన్నారు. రూ. 25 వేల విలువైన పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సింలు, గ్రామస్తులు ముత్తగారి లక్ష్మి బాలగౌడ్ తదితరులున్నారు.

నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

- చోరీకి గురవుతున్న నిర్మాణ సామగ్రి
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం



పిల్లర్ల స్థాయిలో నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

కామారెడ్డి అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వం మారినా అభివృద్ధి పనుల్లో పురోగతి లేకపోవడంపై కామారెడ్డి పట్టణ ప్రజలు పెదవి విరిస్తున్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గాంధీ గంజ్‌లోని మూడెకరాల స్థలంలో సమీకృత శాకాహార–మాంసహార దుకాణాల సముదాయం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ పనులకు 2021లో ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో.65 కింద టీయూఎఫ్ఐడీసీ, పురపాలక సంఘం నిధులు రూ. 7.20 కోట్ల వ్యయం అంచనాతో పనులు ప్రారంభించారు. నిధులు విడుదల చేయనందున నేటికి పూర్తికాకపోవడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే పట్టణ ప్రజలు, రైతులు, వ్యాపారులకు ఎంతో సౌకర్యంగా ఉండేది.

అంచనాలు పెరిగి..

తొలుత 108 దుకాణాల సముదాయంలో 60 కూరగాయలు, 18 పూలు, పండ్లు, 30 మాంసం, చికెన్, చేపల విక్రయం దుకాణాలు, కోల్డ్ స్టోరేజ్‌గా నిర్ణయించారు. అనంతరం పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 146 దుకాణాలకు పెంచి అంచనా వ్యయం రూ. 11.15 కోట్ల అదనపు నిధుల మంజూరు ఇచ్చారు. ఇలాగే రూ. 2 కోట్ల వ్యయంతో బాన్సువాడలో రూ. 2 కోట్లతో ఎల్లారెడ్డి పట్టణాల్లోనూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినప్పటికీ నేటికి అసంపూర్తిగా మిగిలిపోయాయి. జిల్లాలో ఇప్పటికీ మూడు మార్కెట్ కాంప్లెక్స్‌లకు సంబంధించి రూ. 3.30 కోట్ల వ్యయం పనులు పూర్తయినట్లు మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. కామారెడ్డి మార్కెట్ కాంప్లెక్స్ పనులకు సంబంధించి రూ. కోట్లల్లో పనులు పూర్తయినప్పటికీ నిధులు రాకపోవడంతో గుత్తేదారు అగమ్యగోచరంలో పడ్డారు. పనులు ప్రారంభించి రెండేళ్లు అయినప్పటికీ సు మారు రూ. 3 కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉన్నా యని వారంటున్నారు. రెండేళ్లుగా పనులు నిలిచిపోవడంతో కామారెడ్డి మార్కెట్ కాంప్లెక్స్ వద్ద ఇసుక, కంకర, ఇనుము దొంగలు ఎత్తుకుపోయారని, నిర్మాణ ప్రాంతం బహిర్భూమిగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

నిధులు లేక నిలిచాయి

కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాల్లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్‌ల నిర్మాణం పనులు నిలిచిపోవడానికి నిధులు విడుదల కాకపోవడమే కారణం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైన ఈ పనులకు నాటి నుంచి అరకొర నిధులే విడుదలవుతున్నాయి. కామారెడ్డి కాంప్లెక్ నిర్మాణానికి ఇప్పటిదాకా రూ. 1 కోటి మాత్రమే బిల్లులిచ్చారు. ఇంకా రూ. 3.46 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. రెండేళ్లుగా నిధులు లేక పనులు నిలిచిపోయాయి.

– జి సంతోష్, డీఈఈ, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం, నిజామాబాద్

పైసా ఇవ్వలేదు

కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ గాంధీ గంజ్‌కు సంబంధించి 6ఎకరాల 20 గుంటల స్థలం ఉండగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ కోసం 3 ఎకరాల స్థలం తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం జరిగింది. ఇందుకు గాను సబ్‌రిజిస్ట్రార్ విలువ ప్రకారం మార్కెట్ కమిటీకి ప్రభుత్వం నుంచి దాదాపు రూ. 13 కోట్లు రావాల్సివుంది. పనులు ప్రారంభమై మూడేళ్లు కావస్తున్న ఎలాంటి చెల్లింపులు చేయలేదు. విషయం ప్రభుత్వం స్థాయిలో ఉంది.

– డి నర్సింలు, కార్యదర్శి, మార్కెట్ కమిటీ, కామారెడ్డి

పాడి సంపదను పెంచుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి రాజేశ్వర్



గేదెకు టీకా ఇస్తున్న పశువైద్యాధికారి రాజేశ్వర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): వ్యవసాయంతో పాటు పాడిని అభివృద్ధి చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రాజేశ్వర్ అన్నారు. తాడ్వాయి మండలంలోని కన్‌కల్ గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వం రైతుల కోసం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తుందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపశువులను పెంచుకోవాలన్నారు. పాడి రైతులను ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందన్నారు. పశుగ్రాసంను పెంచుకొని పశువులకు ఆహారంగా ఇచ్చినట్లయితే పాలశాతం పెరుగుతుందన్నారు. పశుగ్రాస ఆవశ్యకత, పశుగ్రాసం రకాలు, ప్రభుత్వం ఇస్తున్న గడ్డి విత్తనాల రకాలపై వివరించారు.సబ్సిడీపై మినరల్ మిక్చర్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 49 పశువులకు చూడి పరీక్షలు, 13 పశువులకు కృత్రిమ గర్భధారణ,ఆవులు, గేదేలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఇవ్వడమే కాకుండా సాధారణ చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ అధ్యక్షుడు కిష్టారెడ్డి, మండల వైద్యాధికారిరమేష్, వీఎల్‌వో పోచయ్య, జీవివో కొండల్‌రెడ్డి, ఫ్రేంసింగ్, మహిపాల్‌రెడ్డి, ఎల్లయ్య, కార్యదర్శి సాయిరెడ్డి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో వద్ద నాలుగు గ్రామాల రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సలహాదారు షబ్బీర్‌అలీల చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. బస్వాపూర్ సింగిల్ విండోను బైఫరికేషన్ చేయించినందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్వాపూర్ సింగిల్ విండో బైఫరికేషన్ వల్ల బస్వాపూర్, గుర్జకుంట ర్యాగట్లపల్లి, శ్రీసిద్ధరామేశ్వరనగర్‌కు మేలు కలిగిందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు నరేందర్‌రెడ్డి, బాగిరెడ్డి, జీవన్, రవీందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామంలో చేపట్టే పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేకదృష్టి సారించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్, వదల్‌పర్తి గ్రామాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో పల్లెప్రగతి పనులను ఆయన పరిశీలించారు. దీంతోపాటు గ్రామాల్లోని రోడ్లను, మురికికాలువలను ఆయన పరిశీలించారు. గ్రామంలోని మురికి కాలువల వెంట బ్లీచింగ్‌పౌడర్ చల్లించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. జీపీ కార్యదర్శులు వనజ, అజీమోద్దీన్, ఫీల్డ్‌అసిస్టెంట్లు అంజయ్య, నర్సింలు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు

దోమకొండ : గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి ఎస్సై ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని సంఘమేశ్వర్, గొట్టిముక్కల గ్రామాల్లో వినాయక మండపాల నిర్వాహకులతో ఆయా గ్రామాలలో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిమజ్జన ర్యాలీలకు, డీజేకు అనుమతి లేదన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 18 మంది డీజే నిర్వాహకులను పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించి ముందస్తుగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

అనుమతి తీసుకోవాలి..

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పకుండా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై ఆంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యుత్తు కనెక్షన్ కోసం డీడీ చెల్లించి ట్రాన్స్‌కో అధికారుల అనుమతి పొందాలని సూచించారు.

ఆధ్యాత్మికం

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట గ్రామ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం వేద మంత్రాల సాక్షిగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన చేశారు. గణపతి ఉపాసకులు సంజీవ్‌రావ్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆలయం ఆవరణలో యజ్ఞం, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్వజస్తంభం దాత అంజాగౌడ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్ : స్థానిక అయ్యప్ప ఆలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ప్రతి బుధవారం పేదలకు ఆలయం తరఫున అన్నదానం చేస్తున్నట్లు కమిటీ ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు పంపరి లక్ష్మణ్, శివకుమార్, పబ్బవేణు, ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

31న కోదూరు హనుమాన్ జపయజ్ఞం

కామారెడ్డి అర్బన్ : ఈనెల 31న శ్రావణ చివరి శనివారం ఉదయం 8గంటలకు కామారెడ్డి దళితవాడ లోని పురాతన కోదూరు ఆంజనేయస్వామి జపయజ్ఞం, చందనార్చన పూజోత్సవం నిర్వహించనున్నట్లు వేదపండితులు గంగవరం ఆంజనేయశర్మ తెలిపారు. ఆలయ జీర్ణోద్ధరణకు సహకారం అందించాలని కోరారు.

ఈదమ్మదేవి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కామారెడ్డి టౌన్ : జిలా కేంద్రంలోని ఈదమ్మ దేవి నూతన దేవాలయ భూమి పూజ మహోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పాల్గొన్నారు. కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివ కృష్ణమూర్తి, పంపరి లతా, వంశీ, మమత, రజక సంఘం అధ్యక్షుడు నర్సోల్ల మహేశ్, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి మహేష్, కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లల విడుదల



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మెంగారం ఊర చెరువులో బుధవారం మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ కులస్తులు చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దాసరి పర్వయ్య, కార్యదర్శి తంత్రి వెంకట్, రాజశేఖర్, దత్తురాం, అశోక్, ప్రశాంత్, నాగరాజు తదితరులున్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



బాన్సువాడ : పట్టణంలోని కోటగల్లీలో బుధవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలను కాపాడాలని ఇంటి పరిసరాల్లో మురికినీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మోతీలాల్, నాయకులు ఉప్పరి లింగం, పత్తి గంగాధర్, ఉప్పరి రాము ఉన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ



దోమకొండలో వివరాలు సేకరిస్తున్న అధికారులు



రాజంపేటలో..

దోమకొండ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల వివరాలను బుధవారం వ్యవసాయశాఖ అధికారులు సేకరించారు. వ్యవసాయశాఖ విస్తీర్ణాధికారి కృష్ణారెడ్డి దోమకొండతో పాటు, లింగుపల్లి గ్రామాల్లో రైతుల వివరాలు సేకరించారు.

బాన్సువాడలో..

బాన్సువాడ రూరల్ : వివిధ కారణాలతో పంట రుణమాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నట్లు బాన్సువాడ మండల నూతన వ్యవసాయాధికారి నదీమోద్దీన్ తెలిపారు. ఈనెల 29నుంచి వచ్చేనెల 6వరకు వివిధ గ్రామాల్లో పర్యటించి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్ చేస్తామన్నారు. గురువారం మండలంలోని బోర్లం గ్రామ పంచాయితీ కార్యాలయంలో బోర్లం, బోర్లంక్యాంపు, జక్కల్ దాని తండా, కొయ్యగుట్టతండాలకు చెందిన రైతుల ఫిర్యాదులను ఆన్‌లైన్ చేస్తామన్నారు. 30న బాన్సువాడ, చింతల్‌నాగారం, 31న ఇబ్రాహింపేట్, సింగరాయిపల్లి శివారు రైతులు, సెప్టెంబర్ 2న తాడ్కోల్, బుడిమి, 3న దేశాయిపేట్, పోచారం రాంపూర్, 4న మొగులాన్‌పల్లి, తిర్మలాపూర్, 5న కొల్లూర్, నాగారం, సోమేశ్వర్, 6న కోనాపూర్, హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్ గ్రామాల రైతులు ఫిర్యాదులు ఆన్‌లైన్ చేస్తామన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : రుణమాఫీ కానీ రైతులు ఆన్‌లైన్‌లో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిని సునీతారాణి అన్నారు. బుధవారం రాజంపేట రైతు వేదికలో కుటుంబ సభ్యుల వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రాజంపేట మండలంలో 429 మంది రైతులు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం చేసుకోవాలన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మండల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకులు వెంకట్, కనీరాంలు తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు



నస్రుల్లాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుల నినాదాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : లిక్కర్ కేసులోఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించడంతో నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయమే గెలిచిందని బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ అన్నారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయికుమార్, నర్సింలు గౌడ్, మోసీస్, శేఖర్, సాయిరాం, గంగారాం ఉన్నారు.



కవితతో సింగిల్‌విండో చైర్మన్ కపిల్‌రెడ్డి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని సింగిల్‌విండో చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

30న వికలాంగుల హక్కుల జాతీయ మహాసభ



బాన్సువాడ : ఈనెల 30న బాన్సువాడలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక 3వ మహాసభలు నిర్వహించనున్నట్లు ఎన్‌పీఆర్‌డీ సభ్యులు గంగాధర్ చారి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బాన్సువాడలో జరిగే 3వ జాతీయ మహాసభలో వికలాంగుల సమస్యలపై చర్చించనున్నట్లు, భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన వివరించారు. నూతన జిల్లా కమిటిని ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సభ్యులు డి. సాయిలు, గంగాధర్‌యాదవ్, సురేష్, పూసల కృష్ణ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో బుధవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఆదేశాల మేరకు బాధితులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు షౌకత్‌అలీ, నరేందర్ రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



భిక్కనూరులో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు



దోమకొండ హెల్త్‌క్యాంప్‌లో వైద్యులు

భిక్కనూరు : సీజనల్ వ్యాధులతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి యెమిమా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మద్ది సూర్యకాంత్ రెడ్డి గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు చంద్రకాంత్ రెడ్డి వైద్యులు వెంకట రమణ సతీష్,గ్రామాభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు శశికుమార్, ప్రతినిధులు వినోద్ గౌడ్ హరికృష్ణ గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి రమేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, మాధవి కీర్తి సంగీత రేణుక ఉన్నారు.

దోమకొండ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దోమకొండ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద వైఆర్‌జీకేర్ లింకు వర్కర్ స్కీం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైఆర్‌జీకేర్ లింకు వర్కర్ స్కీం డీఆర్‌పీ సుధాకర్ పీహెచ్‌సీ వైద్యురాలు భానుప్రియ, పల్లె దవాఖానా ఎంఎల్‌హెచ్ జ్యోతి, లింకు వర్కర్ స్కీం సూపర్‌వైజర్ జ్యోతి, లింకు వర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కొనసాగుతున్న పారిశుధ్య పనులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో బుధవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఇళ్ల పరిసరాల్లో నిల్వఉన్న మురికి నీటిని జీపీ కార్మికులు తొలగించారు. ఎంపీడీవో నరేష్, మండల వైద్యురాలు హిమబిందు, డీఎంవో సిబ్బంది, యాదగిరి, చంద్రకళ, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో సర్వే

నాగిరెడ్డిపేట (ఎల్లారెడ్డి) : రుణమాఫీ కాని రైతులకు సంబంధించి వివరాలు సేకరించేందుకు నేటి నుండి గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి హరివెంకట ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కాని కుటుంబాలు మండలంలో 815 ఉన్నాయన్నారు. గురువారం మండలంలోని వదల్‌పర్తి, పోచారం, మాల్తుమ్మెద, గోలిలింగాల గ్రామాల్లో పర్యటిస్తామన్నారు.

నస్రుల్లాబాద్‌లో ఎల్ఆర్ఎస్ సర్వే

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో బుధవారం అధికారులు ఎల్ఆర్ఎస్ సర్వే చేశారు. గతంలో లేఅవుట్ లేని భూములను సర్వే చేసి లబ్ధిదారులకు రెగ్యులరైజేషన్ చేయడానికి విచారణ చేపడుతున్నట్లు గిర్దావార్ అంజు తెలిపారు. ఎంపీవో సూర్యకాంత్ అధికారులు ఉన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలంలోని హంగర్గ గ్రామంలో బుధవారం ఎల్ఆర్ఎస్ భూములు, ప్లాట్లను మండల జీపీ అధికారి రాము సర్వే చేపట్టారు. ప్లాట్లు కొనుగోలు చేసుకొని ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారి స్థలాలను పరిశీలించారు. జీపీ కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

జీపీకి కొత్త ట్రాక్టర్ ట్రాలీ కొనుగోలు

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రం జీపీకి కొత్తగా ట్రాక్టర్ ట్రాలీ కొనుగోలు చేశామని కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రతి వీధిలో ట్రాక్టర్ చెత్త సేకరిస్తోందని, పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడే వారిక చెత్తను ఇవ్వాలని, ఆరుబయట పారవేయద్దన్నారు.

సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ పరికరాలు అందించాలి

భిక్కనూరు : అడవి పందుల నుంచి పంటల సంరక్షణకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ పరికరాలను ఇవ్వాలని అంబేడ్కర్ సంఘం జిల్లా కార్యదర్శి నర్మల రాంచంద్రం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ అడవి పందుల నుంచి పంటల రక్షణకు ఇతర రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు 80శాతం సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్‌ను అందజేస్తున్నాయన్నారు.

తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌రావు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎండ్రి యాల్ గ్రామానికి చెందిన సీఎచ్ రమేష్‌రావు తెలంగాణ సాంస్కృతిక సారథి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బుధవారం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఈ దేవయ్య, ఉపాధ్యక్షుడిగా ఐండ్ల రాము, ప్రధాన కార్యదర్శిగా ఆకుల మహేందర్, కోశాధికారిగా విఠల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, సలహాదారులుగా ప్రశాంత్‌రెడ్డి, కాశీరాం, తిరుపతి, దివ్యశ్రీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా పోశెట్టి, నరేష్, సవిత, లత ఎన్నుకున్నారు.